

**"విమలా,** ఆ చాప పట్టుకొచ్చి ఇలా వెయమ్మా!'' తల్లి సుమతి పురమాయింపుతో చిరుచాప పరిచింది విమల.

భాగీరథి కూర్చొంటుండగా చిరునవ్వుతో చెప్పింది సుమతి: ''అమ్మాయిని ఎప్పుడూ చూపావు కావేం అనేదానివి కదూ? వచ్చింది, ఇక చూడు.''

''అచ్చుగుద్దినట్లు నీ రూపే.'' నేత్రానందం చేకూర్చింది విమల రూపం. ''చదువుకొంటున్నావా, అమ్మా?''

''బి. ఎ. పరీక్ష ఇచ్చానండీ.''

''చదువు పూర్తి అయ్యేవరకు పెళ్లి చేయవా, సుమతీ?'' భాగీరథి అడిగింది.

''చదువు ఇంకా సాగిస్తుంది కాని, శ్రావణంలో పెళ్లి చేద్దామంటున్నారు మా నాన్నగారు. ఇది పుట్టగానే మా చిన్న తమ్ముడు కృష్ణకు చేసుకుంటానని పేరుపెట్టుకొన్నా రాయన. మా తమ్ములు అందరూ





జాతి కుల మత భేదాలు ఉండరాదని అంగీకరించనివారు ఉండరు. అయినా అవి సమసి పోవడం లేదు. అంటే ఇంకా వ్యక్తి ఉన్నతుడు కాలేదని అర్థం. వైయక్తికంగా అలాంటి భేదాలకు అతీతం కానప్పుడు సామాజికంగానూ సాధ్యం కాదది. అలాంటప్పుడు సమాజాన్ని నిందించడ మెందుకు?

---

బాగా చదువుకున్నవాళ్ళే. చిన్నవాణ్ణి విదేశానికి పంపారు. ఈపొద్దో, రేపో తిరిగి వస్తాడు. అలాంటి చదువుకొన్న వాడికి పల్లెటూరు మొహాన్ని చెయ్యడం ఎలా అని ముందే ఆలోచించి చిన్నప్పటినుండి తమ దగ్గిరే ఉంచుకొని తమ అలవాట్లలో పెంచుతూ చదువు చెప్పిస్తున్నారు మనుమరాలికి. మా నాన్నగారివి అంతా దొరల పద్ధతులు కదా?" సగర్వంగా చెప్పింది సుమతి.


తల్లి పక్కనచేరి, మెల్లిగా అడిగింది విమల: "ఎవరమ్మా, ఈమె?"

"కొండపేట అంచున మనం కొన్న తోట ఈమెదే!"

"అలాగా? మొన్న ఆ మధ్య వెళ్ళినప్పుడు తోట మాలి చెప్పాడు—ఆ తోటంటే మీ అబ్బాయికి చాలా ప్రేమనీ, తోట అమ్మడం అతడి కెంతమాత్రం ఇష్టంలేదనీ. అందులో సగం చెట్లు మీ అబ్బాయే పెట్టి, పెంచాడట."

"అమ్మడం వాడికీ ఇష్టంలేదు; నాకూ ఇష్టంలేదు. పరిస్థితి అలా వచ్చింది మరి." బరువుగా నిట్టూర్చింది భాగీరథి.

ఇక్కడ సుమతీ, భాగీరథుల స్నేహం కొంత వివరించాలి. సుమతి వివాహాత్పూర్వం తాతగారి దగ్గర



చీరె రు. 6/- లు మాత్రమే



సొగసైన రంగులలో చక్కని చేనేత చీరె రు. 6-/ లకే పొందండి. కొద్ది స్టాకులే ఉన్నవి. మీ అడ్రసును ఇంగ్లీషులో వ్రాస్తూ వెంటనే ఆర్డరివ్వండి.

L. D. Ahuja & Sons (WAP)
Post Box No, 1346, Delhi-6.

మూడు నెలలకు ఉచిత బహుమతి



స్త్రీ సౌందర్యపు కాశ్మీర్ ఆర్టు చీరెలు. ఆకర్షణీయమైన సరికొత్త డిజైన్లలో, రంగులలో ఈ తరుణానికి తాజాగా వచ్చియున్నవి. కొద్ది స్టాకులు. మావద్ద పెద్ద సైజువి మాత్రమే ఉన్నవి. ధర 1. రు. 10/-లు, 2. రు. 18/-లు, 3. రు. 25/-లు, 4. రు.32/-లు. రెండు గాని, ఎక్కువగాని చీరెలు ఆర్డరిచ్చినవారికి సిల్కు నెక్టై లేక జాకెట్టు ముక్క ఉచితం. ఆర్డరు పోస్టు పార్సెల్ ద్వారా పంపబడును.

ARVIND AGENCIES (WAP-55)
Post Box 1408, Delhi-6.




# సమర్పణ

రామాపురంలో ఉండేది. నిత్యం దేవతార్చనకై వచ్చే రఘురామాచారి వెంట ఆయన కూతురు భాగీరథీ వచ్చేది. అలా కలిసింది సుమతికి భాగీరథితో స్నేహం.

రంగాపురంలోని కృష్ణనాయుడికి ఇచ్చి వివాహం చేశారు సుమతిని. విమలకు అయిదేళ్ల వయస్సులో తండ్రి చనిపోయాడు. ఉన్న భూముల మీద వ్యవసాయం దక్షతతో నిర్వహిస్తూ, అతడు ఉంచిపోయిన నగదు పైకంతో వడ్డీవ్యాపారం సాగిస్తూ ఆ చుట్టుపక్కల పల్లె జనానికి షాహుకారు అయింది సుమతి,

భాగీరథిని కొండపేటలో ఇచ్చారు. రంగాపురానికి, కొండపేటకు ఏరు మాత్రం అడ్డు. రాజగోపాలాచారికి భాగీరథి ద్వితీయ కళత్రం. ప్రథమ భార్య ఒక కొడుకును కని దాటిపోయింది. పిల్లవాడికి ఆరు నెలలు దాటకుండానే భాగీరథి తల్లిగా వచ్చింది. ఆమె కాపరానికి వచ్చిన రెండేళ్ల లోపలే భర్త దేశాంతరగతుడైనాడు. అందుకు కథ ఏదో ప్రచారంలో ఉంది. దేవి ఉపాసన చేశాడనీ, ఆమె తల కొట్టిందనీ, పిచ్చెత్తి దేశాలపాలయ్యాడనీ అంటారు. పన్నెండేళ్ల వరకూ చూసి అతడు తిరిగిరాకపోవడంతో భాగీరథిని ముండమోపించారు.

భాగీరథి, కొడుకు చదువుల నిమిత్తం సుమతి దగ్గర కొంతడబ్బు అప్పుగా తీసుకుంది కాని తీర్చే విధానం లేక అయిదువేలు ఖరీదుచేసే తోట, మూడెకరాల తరిభూమి సుమతికి విక్రయించింది.

"కొంచెం పనిబడి వచ్చాను." మెల్లిగా అన్నది భాగీరథి. డబ్బుకు ఇబ్బంది కలిగినప్పుడల్లా సుమతి దగ్గరికి పరిగెత్తుకు రావడం మామూలే.

"పని లేకుండా వచ్చిన దెప్పుడు, నువ్వు? మన బాల్యస్నేహం మధ్య ఎప్పుడు మాయమయిందో కాని నేను నీ కొక షాహుకారు నయిపోయాను." నవ్వింది సుమతి. తిరిగి అన్నది: "ఎన్నాళ్ళిలా? అబ్బాయి ఒక ప్రయోజకుడయినా, ఇంకా పసివాడిలా నీ మీద ఆధారపడి ఉండడ మేమిటి? ఏదీ పట్టించుకోకుండా అతడు అలా గాలికి తిరగడానికి కారణం నన్నడుగు. తల్లీ, తండ్రీ లేరని నువ్వు చేసిన గారాబమే అతడి కేమీ లోకం తెలీకుండా చేసిందని చెబుతాను."

"అది నా ఖర్మ!" నిర్వేదంగా నిట్టూర్చింది భాగీరథి.

"తండ్రితోపాటు తల్లీ లేదంటావేమమ్మా? ఈమె కొడుకు కాదా, అతడు?" ఆశ్చర్యపోతూ అడిగింది విమల.

"అయ్యో! దీనికి అంత రాత ఎక్కడిది? దీని భర్త మొదటి భార్య కొడుకు." సానుభూతిగా పలికింది సుమతి కంఠం.

"అలా చెప్పు. సవతి కొడుకన్నమాట! ఈమె కష్టం ఎందుకు గుర్తిస్తాడు?" కనిపెట్టేసినట్లు చటుక్కున అంది.

"అదేం లేదు, అదేంలేదు వాడికి." నొచ్చుకొంటూ అంది భాగీరథి. "వాడికి నే నంటే పంచప్రాణాలు. నేనే

వాడికి ఖచ్చితంగా ఏ పనీ చెప్పలేను. వాడికి ఇష్టంలేని పని చెయ్యమని అనలేను. అక్కడికీ నా బలవంతంపైపై ఊళ్లకు వెళ్లి చదివినా, ఇప్పుడు నన్ను విడిచి వెళ్లనంటాడు. వెధవ ఉద్యోగం లేకుంటే లేక పోయింది. అబ్బాయి నాపక్కలో, రెక్కలో ఉండడం కంటే నాకేం కావాలి? మరి ఈ ఇంట్లో జరుగుబాటు కానప్పుడు ఉద్యోగానికి వెడితే బాగుండుననిపిస్తుంది కాని, వాణ్ణి విడిచి నేనూ ఉండలే ననిపిస్తుంది.''

''వేలు గుమ్మరించి డాక్టర్ని చేయించి ఒళ్లో కూర్చో బెట్టుకో అబ్బాయిని, భాగీరథమ్మా! నీ మురిపెమే అతడి నలా చేసింది! పరోపకారం అంటూ పల్లెలవెంట బయలుదేరాడు, మందుల సంచీ పట్టుకొని.'' పరిహసించింది సుమతి. ''బస్తీలో ప్రాక్టీస్ పెట్టమను. ఏడాది తిరక్కుండానే ఇల్లు బంగారమైపోతుందీ? నీకే తిప్ప లేమిటి?''

''ఏమో! అతడి తత్వం ఒక రెలా మార్చగలరు?'' ఉదాసీనంగా మారిపోయింది భాగీరథి వదనం. కొడుకును ఎవరు విమర్శించినా సహించలేదు ఆమె మనస్సు. దారిద్ర్యం భరించలేనప్పుడు అతడిపై కొంచెం విసుక్కొన్నా అతడి ఆదర్శ సాఫల్యానికై మనసారా ఆశీర్వదిస్తుంది.

• • •

సాయంకాలం షైరుకు వెళ్లడానికి తయారైన విమల, ''తోటకు వెళ్లి వస్తానమ్మా'' అన్నది తల్లితో.

''వర్షం వచ్చేటట్లుంది. నువ్వు వెళ్లి ఏటి అవతల

## సూగూరి శాంతాదేవి

చిక్కుబడితే?''

''ఏమీ రాదులే. పెందరాళే వచ్చేస్తాగా?''

''చెబితే వింటావు కనకనా? తిక్క కుదరాలిలే.' చిరుకోపంతో కసిరింది సుమతి. కూతురు తన మాట ఎంతమాత్రం లక్ష్య పెట్టదు. వట్టి పెంకెఘటం. ఎప్పుడో తన దగ్గిరికి వస్తే గారాలు, మారాములు తప్ప బొత్తిగా శ్రద్ధాభక్తులు సున్నా!

వైశాఖ మాసం చివరి దినాలు. కృష్ణానది పలచగా పారుతూఉన్నా అవతలిగట్టుకు వెళ్లాలంటే దోనెలో వెళ్ల వలసిందే. ఏరు దాటించే రాముడు దోనె ఆపుకొని అవతలి గట్టున ఉన్నాడు. విమల ఓ రాయి ఎక్కి చెయ్యి ఊపుతూ ఎలుగెత్తి పిలిచింది.

మెల్లిగా దోనె నడుపుతూ తీసుకు వచ్చాడు రాముడు. ''తోట కెళ్లాలా, అమ్మాయిగోరూ? వాన వాసన వొస్తుండదే? తిరిగి ఎప్పుడు రావాల, తమరు? వోర్షం ఒస్తే గిట్ట నేను దోనె వెయ్యను సూడండి!''

''నీ మొహం! వర్షం రాదు, గిర్షం రాదు.'' చెంగున దోనెలోకి దూకింది విమల. దోనె అవతలి గట్టు చేరింది.

ఏటిలోనుండి వల లాగిన తిమ్మడు విమల దగ్గిరికి పరుగున వచ్చాడు. ''శాపలంటే తమరికి శానా ఇష్ట మన్నారుగా? రొండు మాంచి మట్టలు పడ్డాయి. తీసుకొంటారా?''

బుట్టలో ఉన్న చేపల్ని చేతబట్టుకొని బరువు చూస్తూ బేరమాడసాగింది విమల.

''అయ్య బాబ 'య్! బాబుగారు వస్తున్నారు. చీవాట్లు తప్పవు, నా కీయేళ.'' అల్లంత దూరంలో లాల్చీ, పంచ కట్టులో వస్తున్న ఓ యువకుణ్ణి చూచి కంగారు హెచ్చిపోయింది తిమ్మడిలో.

''ఎందుకనీ? ఏమైందనీ?'' అర్థంకాక తెల్ల బోయింది విమల.

''జీవహింస చేయవద్దంటారమ్మా! చేసేవాళ్లను చూస్తే కోపగిస్తారు. శానా మంచి బాబులు లెండి, ఆయన. మా కొండపేటలో ఆయనంటే భయ విశ్వాసాలు మెండు, అందరికీ.''

''ఊహూఁ? అలాగేం?'' వంకర తిరిగిన ఆమె పలచని పెదవులపై తిరస్కారభావం ఏదో కదిలి మాయ మయింది.

''కుక్కతోక అయిందేమిరా, తిమ్మా, నీ బుద్ధి?'' వారిని సమీపిస్తూ అన్నా డతడు.

''పొట్టతిప్పలు, బాబూ!'' లజ్జాభయాలతో కూరుకుపోతూ అన్నాడు తిమ్మడు.

''చదువుకొన్నారులా ఉంది. మాంస భక్షణం మానెయ్యగల సంస్కారం కొరవడిందా, మీకు?'' నిశితంగా చూశాడు విమల కళ్లలోకి.

''చదువు సంస్కారాలకూ, మత్స్య మాంస భక్షణలకూ సంబంధ మేమిటో?'' తిరస్కారం, నిర్లక్ష్యం మేళవించాయి కంఠంలో.

''ఉంది. సంబంధం ఉంది. నిజమైన విద్యాగంధం మీలో ఉంటే భగవంతుడి సృష్టి విలువ మీకు తెలిసి వచ్చేది. మీ ప్రాణం ఎంత విలువైనదిగా చూచుకొనే వారో, భగవంతుని ప్రతి సృష్టినీ అంత ఇదిగా చూడడం నేర్చుకొనేవారు.''

''బయలుదేరాడు అహింసామూర్తి, ఆదర్శ పురుషుడూ!'' హేళనగా చూసింది.

''తిమ్మా, వాటిని నీటిలో వదిలెయ్యరా.''

తిమ్మడు అందుకు సన్నద్ధుడు కాగా, అలా చెయ్యడం తన కేమిటో అవమాన మనిపించింది విమలకు. ''నేను కొన్నా నివి. నీటిలో వదిలెయ్యమంటారేం?''

''ఆ డబ్బు నే నిస్తాగాని, వదిలెయ్యండి.''

''ఊహుఁ. ఆ డబ్బు ఇచ్చినా, ఎక్కువిచ్చినా నేను వదలను! ఈ రాత్రి నేను వీటిని తినవలసిందే!'' పట్టుదల, పంతం తన సొమ్మన్నట్లు వాదించింది.

''అయితే, బలవంతాన నేను వాటిని తీసుకోవలసి వస్తుంది.'' అతడూ ఆవేశ పడినట్లున్నాడు. రెండడుగులు ముందుకు వేశాడు.

''శాపల్ని మీరు ముట్టుకొన్నారని తెలిస్తే అమ్మగారు మిమ్మల్ని అగ్గితో కాల్చిగాని ఇంట్లోకి రానియ్యరు.'' తిమ్మడు నవ్వసాగాడు.

అతడెక్కడ లాక్కుంటాడో అన్నట్లు రెండు చేతులా చేపల్ని గట్టిగా వక్షానికి అదుముకొని రోషంగా అరిచింది. ''అహింసా పదం ఒకటి నాగరిక లక్షణమైపోయింది, నేడు. అంతః సంస్కారం గుండుసున్నే. భగవత్సృష్టి అన్నారే? సృష్టితరవాత స్థితే కాదు, లయం కూడా ఉందని తెలియదూ? స్థితి క్షణికం. లయం శాశ్వతం. ఉన్నన్నాళ్లూ హాయిగా బతక్క అర్థం లేని పదాలతో జీవితం వ్యర్థం చేసుకుంటావూ? హింసా, అహింసా అంటూ నోటి ముందరి తిండి పారేసుకోనా?

''భోగభాగ్యాలతో కూడుకొన్న దీ సృష్టి. భోగి లేనిది భోగ్యానికి అర్థం, పరమార్థం లేవు. చిన్న ఉదాహరణ. సూటిగా మీ ముందున్నదే చెబుతున్నాను. స్త్రీ పురుషుడికి భోగ్యం. అదీ నాతో సమానమైన ప్రాణి అనీ, బాధపెట్టడ మెందుకనీ స్త్రీని విడిచి ఆజన్మ బ్రహ్మచర్యం పాటించగలరా?'' పెంకెగా నవ్వింది. ''ఏమిటో, రోజు రోజుకూ హరిదాసుల సంఖ్య అధికమౌతున్నది. చెప్పడంలో ఉన్నది చేతల్లో ఉండదు.'' ఎత్తిపొడిచింది.

'ఇదెక్కడి సిగ్గువిడిచిన ఆడదిరా!' అనుకొన్నాడేమో చటుక్కున తలవంచుకొని వెళ్లిపోయి, సమీపంలో ఉన్న ఓ రాతి మీద కూర్చొన్నాడు, నదీతరంగాలకేసి చూస్తూ.

విజయగర్వంతో వీగిపోవడానికి బదులుగా అతడలా నిర్లిప్తంగా నిష్క్రమించడంతో నొచ్చుకొంది ఆమె మనస్సు! అసలు పురుషుడి విజయానికి స్త్రీ ఆనందించినంతగా, తన విజయానికి ఆనందించలేదేమో? అతడి చెయ్యి పైన, తన చెయ్యి కిందుగా ఉంటేనే సహజమైన హాయి, మధురానుభూతి లభ్యం అవుతాయేమో!



వాయులీన వాదన
చిత్రం — బి. ఎస్. స్వామి (మదరాసు)

'అత డెవరు? ఎవరైనా, అతడి ఆదర్శం మంచిదే. విపరీతంగా ఎందుకు వాదించాను?' అనుకొంది.

కొందరు ఉంటారు. మంచిదని తోచినదానికి జీవితాలు అర్పించేవారు. ఇతరులనూ అదే మార్గంలో నడిపించ ప్రయత్నిస్తారు. సమయ సందర్భాలూ, పరిచయా పరిచయాలూ తర్కించరు. నచ్చిన దేమిటో చెప్పడమే పని. అర్థం చేసుకోనివారికి వారి ప్రవర్తన విపరీతంగా ఉండడం సహజం.

చేపల్ని నదిలోకి వదిలేసి, అడిగింది విమల: ''ఎవ రతడు, తిమ్మడూ?''

తమవాడి మాట ఈ పెంకెపిల్లను లొంగదీసిందని సంబరమేమో, మహోత్సాహంతో చెప్పాడు తిమ్మడు: ''సూడటానికి అట్టున్నాడా అయ్య? డాక్టరమ్మా,

(తరువాయి 37 వ పేజీలో)

# సమర్పణ

( 35వ పేజీ తరువాయి)

డాక్టరు! బ్రాహ్మడి బిడ్డడు. నీతిగా, న్యాయంగా, సాధువుగా బతక మంటాడు. ఉద్యోగంకోసం ఆసపడ లేదు మహరాజా. బస్తీల ఎంబడి పోయి డబ్బు మూటలు కట్టడం కంటే, ఈ పల్లె మందికి చేతనైన సేవ చెయ్యడంలో నిర్మలమైన తృప్తి ఉందంటాడు.''

ఎందుకో ఒక్క నిట్టూర్పు విడిచింది. ''ఈ తిండి వల్ల వచ్చిందేమీ లేదు, ఒళ్లు పెంచుకోవడం తప్పితే. ఆయనతో చెప్పు, ఇక మత్స్య మాంసాలు ముట్టనని'' అని కదిలింది.

విమల తిరిగి వచ్చేటప్పుడు గాలివాన వెంటబెట్టుకొనే వచ్చింది. ఇంటికి వెళ్లబోతూన్న రాముడు ధ్వస్తే దోనె వెయ్యనంటాడు.

''మరి, ఎల్లాగరా, నా గతి?''

''చెబితే విన్నారూ? వారషం వొస్తుందని చెప్పలా? నాతో రండి. మా అమ్మగారింటికి తీసికెళతాను. రేపు ఉదయమే దాటిస్తా.''

''పద, మరి.'' ఇష్టం లేకపోయినా గత్యంతరం లేక కదిలింది విమల.

ఏ పూర్వీకులు కట్టించిందో, విశాలమైన పెద్ద భవంతి. వరండాలోకి అడుగుపెడుతూనే హాల్లో కూర్చొని ఉన్న అతడు చివాలున లేచి ఇవతలికి వచ్చాడు, ''అయ్యో! వర్షంలో తడిశారూ? రండి, రండి'' అంటూ.

అతడి వెనకే వచ్చిన భాగీరథి, ''ఈ అమ్మాయి నీకు ఎలా తెలుసురా, వాణీ?'' అన్నది ఆశ్చర్యపోతూ.

''సాయంకాలం నది గట్టుకు షికార్ వెళ్లానమ్మా. అక్కడ...''

అతడి మాట ముగియకముందే, ''ఇంట్లోకి రా, విమలా! పూర్తిగా తడిశావు'' అంటూ లోనికి దారి తీసింది భాగీరథి. విమల ఆమెతో వెళ్లింది.

''చీర మారుస్తుంది. నీ ధోవతి ఒకటి తెచ్చి ఇయ్యి, వాణీ! నా చీర లెక్కడ కట్టుకోమనను, ముత్తయిదు పిల్లను?'' అని, విమలతో ''దబ్బున చీర మార్చు. ఎక్కువసేపు తడిబట్టల్లో ఉంటే జలుబు చెయ్య గలదు. నేను వెళ్లి కాఫీ చేసుకువస్తాను'' అని చెప్పి లోనికేగింది.

డాక్టరునుండి ధోవతి అందుకొన్న విమల, ''ఏమిటి? అంత తదిగా చూస్తున్నారు? కొంపదీసి ఏ చిత్ర కారులో, శిల్పకారులో కాదు కదా?'' చిలిపిగా అన్నది, చిరుసిగ్గులు చిలకరిస్తూనే.

''నో, నో. ఏ కారునూ కాదు. మీ కా భయమేమీ అక్కర్లేదు. అసలు ఇప్పటి మీ రూపు కాగితాలమీద దిద్దవలిసిందీ, రాళ్లమీద చెక్కవలిసిందీ కాదు. పదిలంగా గుండెలో దాచుకోవలిసిన అపురూప సౌందర్యం.'' ముగ్ధహాసం ఒకటి చేసి, తిరిగి అన్నాడు: ''ఏమీ అనుకోకండి. నాది సౌందర్యాన్ని ప్రేమించే మనస్సు.''

''అహాహా. మనిషిని ఆ మాత్రం అర్థం చేసుకోగల సంస్కారం కొరవడలేదు నాకు. సౌందర్యాన్ని మెచ్చుకున్నంతలో విరుచుకుపడే సంకుచితురాలిని కాదు.'' ఆమె కన్నులీనే కాంతులు చుక్కల తళుకులనే ధిక్కరిస్తున్నాయి.

''కృతజ్ఞుణ్ణి.''

''మీ పేరు వాణీయా?'' పరిహాసంగా, మృదువుగా నవ్వింది.

''వాణీ ప్రసాద్. అమ్మ పిలుస్తుంది ముద్దుగా 'వాణీ' అని.''

తెలతెలవారుతూండగా లేచిన భాగీరథితోపాటు మేలుకొంది విమల.

పాలు పితకబోతూ లేగదూడను పట్టుకోడానికి పిలిచింది విమలను, భాగీరథి. ''వాణీ నిద్రపోతున్నాడు. దూడను పట్టుకోవడానికి వస్తావా, విమలా?''

''ఓ! దానికేం?''

భాగీరథి గోక్షీరం పితుకుతూండగా విమల పట్టుకున్న లేగదూడ చిందులు వేస్తున్నది, విడిపించుకొని తల్లి పొదుగుకు ఎప్పుడు ఎగబడదామా అని. దాని లేత మొగం, నల్లని కళ్లూ ముచ్చట గొలుపుతున్నాయి విమలకు. ''చాల్లే, అల్లరి. కాస్సేపు ఆగుదూ!'' గంగడోలు ప్రియంగా నిమరసాగింది. ఏమిటో, నిన్న సాయంత్రంనుండి విచిత్రమైన అనుభూతికి లోనవుతున్నది ఆమె హృదయం. అసలు పల్లె ప్రాంతాలలో శాంతి సౌందర్యా లధికం. భాగీరథీ వాణీ ప్రసాదుల వంటి పరిశుద్ధులైన మనుష్యుల మధ్య మరీ అధికం.

ఉదయం ఎనిమిది గంటల వరకు అక్కడే ఉంది విమల. ఆ ఇంటిలో ఉన్నంతసేపూ పరిశుద్ధమైన ప్రశాంతి అనుభవించింది ఆమె హృదయం. తాతగారి దగ్గిర ఒక విధమైన యాంత్రిక జీవితానికి అలవాటు పడిపోయింది తను. ఈవలి పుల్ల తీసి ఆవలవేసే అవసరం లేదు. నౌకర్లూ వంట మనుష్యులూ ఉన్నారు. అమ్మ దగ్గిరికి వచ్చినా అంతే. ఆవిడ ఎప్పుడూ వడ్డీ వ్యాపారాలతో, వ్యవసాయపు వ్యాసంగంతో సతమతమౌతూ ఉంటుంది. ఇల్లు నౌకర్ల అధీనం.


స్త్రీ చేసే సేవతో గృహానికివచ్చే కళాకాంతు లేమిటో భాగీరథిని చూస్తే తెలుస్తుంది. అన్ని పనులూ స్వంతంగా చేసుకుంటుం దామె. ముగ్గులు పెట్టి అద్దంలా ఉంచుకొన్న ఇల్లూ, శుచీ శుభ్రం తెలిపే ఆమె పనులూ చూస్తుంటే ప్రతి చిన్న పనికీ నౌకర్లమీద ఆధారపడిన తన జీవితం అర్థంలేదనిపించింది విమలకు.

• • •

వాణీప్రసాద్ ఎర్రపల్లినుండి వచ్చాడు. ఆ చుట్టుపక్కల గ్రామాలన్నింటికీ అతడే డాక్టరు. ప్రతి ఉదయం మందుల సంచీ తీసుకొని కాలినడకనే వెళ్లి వస్తూంటాడు.

సంచీ బల్లమీద ఉంచేసి, ''ఒక పది రూపాయలు కావాలమ్మా. ఎర్రపల్లిలో ఒక రోగి...'' అంటూన్న అతడి మాట పూర్తి కాకుండానే లోనికి వెళ్లింది భాగీరథి. ఏ రోగో పేదవాడనో, ఇంకెవడో విపత్తులో ఉన్నాడనో తన దగ్గిర పదులూ, ఇరవైలూ పట్టుకువెళ్లడం మామూలే.

తాటి బుట్టనుండి ఓ పది రూపాయల నోటు తీసి కొడుకు చేతిలో పెట్టి అంది భాగీరథి: ''వారం కూడా తిరగలేదు, సుమతి దగ్గిర వంద రూపాయలు అప్పు తెచ్చి. ఇక మిగిలింది పది రూపాయలు మాత్రమే. ఇలాగే ఈ అప్పు పెంచుతూ పోయామంటే, దానికి అర్పించడానికి ఇక ఇల్లు తప్ప మరేమీ మిగలదు, మీ తండ్రిగారి ఆస్తి. రోజులు ఏ విధంగా గడుస్తున్నాయో కొంచెం యోచించవేం, వాణీ?''



నర్తకి (కంచి శిల్పం)

ఫోటో—ఎస్. ఆర్. డి. మూర్తి (మద్రాసు-4)

''....'' నిస్సహాయంగా, వ్యథాభరితంగా చూస్తూ ఉండిపోయాడు.

''లేనివాణ్ణి ఎలానూ అడగవు. కాస్త ఉన్నవాణ్ణి అయినా అడగకపోతే ఎలా, బాబూ? అడగనిది అమ్మయినా పెట్టదట. ఇస్తే చెయ్యి చాపుతానంటే ఎలా? కష్టం చేసిన చోట మోహమాటం దేనికి?'' అన్నది.

''అడగాలి... అడగాలి'' సణిగాడు.

''నీ ఇష్టం, బాబూ! పాతికేళ్లు వచ్చినా పసివాడిలా చూసుకొంటున్నాను. ఈ కాస్త నీడ కూడా తొలిగిపోతే నీ గతి ఏమౌతుందోనని బెంగగా ఉంది.'' భాగీరథి కంఠం గద్గదమైంది. అణచుకోలేని ఆవేదన ఏదో ముఖంలో వ్యాపించింది.

''అమ్మా!'' వ్యాకుల కంఠంతో పిలిచాడు. అవ్యక్తమైన భీతి ఏదో హృదయాన్ని కలచసాగింది. భాగీరథిలో శిథిలమౌతున్న యౌవనంతోపాటు దగ్గూ, నీరసమూ స్థావరం ఏర్పరుచుకొని ఆమె రక్తమాంసాల్ని పీల్చివేస్తున్నాయి. తా నిచ్చిన మందులు బూడిదలో పోసిన పన్నీరు. మనస్సులోని ఆవేదన ఆమెను నమిలివేస్తుంటే బాహ్య చికిత్సతో ప్రయోజన మేమిటి? ఆమెను చూస్తే ఆమె మాట నిజమయ్యే రోజు దగ్గిరికి వచ్చినట్లే ఉంది. 'అమ్మ నీడ నా కిక కొన్నాళ్లేనా?' అతడి హృదయం భారమై పోయింది.

''ఉద్యోగానికి వెళతానమ్మా!''

కొడుకు మనస్ఫూర్తిగా ఆ మాట అనడం లేదని తెలుసు భాగీరథికి. శుష్కహాసం చేసి, ధృతంగా




TIARA

టియారా మీస్నానానికి సంపూర్ణత సమకూరుస్తుంది

స్నానంచేసాక మీలోని స్త్రీయత్వం, కొంటితనం మురిసి పోవాలనుకొంటారా? టియారా లనోలిన్ వంటిమీద బాగాజల్లుకొనండి. టియారా మీ సౌందర్యానికి అపురూపమైన శోభచేకూరుస్తుంది. దాని మృదుసువాసనలు మీ చెవులలో. రహస్యాలు చెబుతాయి. దీనిలోలనోలిన్ వుండి, చర్మసంరక్షణకూ, శరీరంచీటలు పడకుండావుండేటందుకు—ఉపయోగపడే ప్రకృతి సిద్ధమైన పదార్థమిది. అంతేకాక శరీరపు దుర్వాసనలను ఇది పైకిరానీయదుకూడా. టియారాను నిత్యము ఉపయోగించండి. ఇదిమీ స్నానానికి సంపూర్ణత సమకూరుస్తుంది. రాత్రికి శోభచేకూరుస్తుంది

J.K. Helene Curtis

సోల్ డిస్ట్రిబ్యూటర్లు: స్పెన్సర్ అండ్ కంపెని లిమిటెడ్




PRESYN/HC/6A/66

# సమర్పణ

అన్నది: "అక్కర్లేదు, వాణీ! ఎవరికోసం నువ్వు నీ ఆదర్శాన్ని త్యజించి ఉద్యోగానికి పోతానంటున్నావో ఆమె ఇక కొన్నాళ్ళే జీవించేది. ఉద్యోగం చేసి ఇక ఎవరిని సుఖపెడతావు? నీ ఒక్కడి కోసమా? నీ గుక్కెడు ప్రాణం నిలబెట్టుకోడానికి ఆ పూటకు గరిటెడు గంజి దొరక్కపోదులే."

సుమతి పంపగా వచ్చిన నౌకరు మల్లిగాడు, "సుమతి అమ్మగారు మిమ్మల్ని తీసుకు రమ్మన్నారండీ. విమలమ్మ గారికి ఒకటే జ్వరమూ, రొంపానండీ!" అని చెప్పాడు.

"వస్తా, పద."

● ● ●

"రా, నాయనా!" సాదరంగా ఆహ్వానించింది సుమతి, వాణీప్రసాద్‌ను. ఆమె విమల గదిలోకి దారి తియ్యగా అనుసరించాడతడు.

"మొన్న వద్దని చెప్పగా కూడా అవతలికి వెళ్ళి వర్షంలో తడిసిందా? వచ్చినప్పటినుండి ఒకటే రొంప, రాత్రినుండి ఒకటే జ్వరమూ." సుమతి ఫిర్యాదు చెవిని పడి తల తిప్పి చూసింది విమల. తల్లి వెనకాలే గదిలోకి వచ్చిన డాక్టర్ని చూడగానే ఆమె కళ్ళు చంద్రుని చూసిన కలువలయ్యాయి. అంతవరకూ క్షణం విరామం లేకుండా లయబద్ధంగా మూలుగుతూన్న ఆమె దీర్ఘ రోగం నుండి బయట పడినదానిలా తేలిక చెందింది: "రండి, డాక్టర్!" లేచి నిల్చోబోతూ అంది.

"మీరు కూర్చోండి, కూర్చోండి." నివారించాడు వాణీప్రసాద్.

అంతవరకూ విమల మంచం దగ్గిరే కూర్చుని ఆమె అభ్యంతరం చెప్పినా వినకుండా పరిచర్యల్లో మునిగి ఉన్న కృష్ణ, డాక్టరుకోసం తన కుర్చీ ఖాళీచేసి పక్కగా నిల్చున్నాడు.

విమల చెయ్యి చూచి, ఇంజక్షన్ ఒకటి చేసి కుర్చీలో కూర్చున్నాడు వాణీప్రసాద్. కృష్ణను పరిచయం కావించింది అతడికి, సుమతి: "వీడు నా చిన్న తమ్ముడు, కృష్ణ. విమలకు కాబోయే భర్త. లండన్‌నుండి నిన్నే తిరిగివచ్చాడు, హైదరాబాదుకు. విమల ఇక్కడున్నందుకు ఒక్క రోజైనా నిలవలేక తెల్లారేసరికి ఇక్కడ వాలాడు. అది వాడి ప్రాణం!" ముసిముసి నవ్వులు ఒలకబోస్తూ చెప్పుకుపోతూన్న సుమతి, కూతురు తనను మింగేసేలా చూస్తూండడం గుర్తించనే లేదు.

మందహాసపూర్ణ వదనంతో గదిలోకి అడుగు పెట్టిన డాక్టరు, తన పరిచయంతో అతడి ముఖం తెల్లకాగితంలా వివర్ణం కావడం గుర్తించాడు కృష్ణ. విమల ముఖంలోకి లోతుగా, పరీక్షగా చూశాడు. అతడి హృదయాన్నుండి బరువైన ఒక నిట్టూర్పు నిశ్శబ్దంగా బయలువెడలింది.

"వాడు అంత తహతహలాడిపోతూ పరిగెత్తుకు వస్తే ఇది మూలుగుతూ పడుకొంది, ఓ సరదా మాటా, పాటా లేకుండా." తమ్ముడికేదో అన్యాయం జరిగిపోయినట్లు వాపోయింది సుమతి.

"ఇక నే వస్తానండీ!" లేచాడు వాణీప్రసాద్.

"అప్పుడే వెళ్లాలా? కాస్సేపు కూర్చోండి. కులాసాగా కబుర్లు చెప్పుకోవచ్చు. మాటల్లో కాస్త బాధ మరిచినట్లవుతుందేమో?" విమల అర్థింపు వాణి ప్రసాద్‌ను ఆపలేదు కాని కృష్ణ హృదయంలో తుఫాను ఒకటి సృష్టించి వదిలింది.

తను విదేశం వెళ్లి వచ్చిన విశేషాలు మహోత్సాహంతో చెప్పబోతే, "అబ్బా! నీ కబుర్లు తరవాత వింటా కాని నా ప్రాణాలు తోడకు, బాబూ! ఇప్పుడే తల పగిలిపోతూంటే నీ కబుర్లన్నీ నా బుర్రలో దూర్చకు" అని విసుక్కొన్న విమల, ఈ డాక్టరు బాబుతో కబుర్లకోసం ఉవ్విళ్లూరడానికి కారణమేమిటి? ఆమె బాధ చూడలేక బామ్ రుద్దుతానన్నా, కణతలు ఒత్తుతానన్నా తీవ్రంగా అడ్డుపెట్టి తనను ఒంటరిగా వదిలివెళ్లడమే పదివేలన్న విమల అతడి సాన్నిధ్యం కోరడంలో ఆంతర్య మేమిటి?

• • •

ఆవతలి గట్టున దోనె దిగుతూనే నదీస్నానంచేస్తూన్న వాణీ ప్రసాద్ దగ్గిరికి వెళ్లింది విమల. "ఇప్పుడు చేస్తున్నా రేమిటి స్నానం, సాయంత్రంవేళ?"

అతడి ముఖం మ్లానమై ఉంది. మనిషి దిగాలుగా ఉన్నాడు.

"అమ్మ నిన్నటి నుండి మంచం దిగలేదు. కన్ను తెరవని జ్వరం. ఇప్పుడిప్పుడే కొంచెం తెలివిలోకి వచ్చింది. ఉదయం నుండి మంచం దగ్గిరినుండి కదలడానికి వీలు కలిగింది కాదు. ఇప్పుడు వెళ్లి వంట చేసుకోవాలి. అమ్మకు జావ కాచి ఇవ్వాలి." నీరసంగా జవాబిచ్చాడు.

"అలాగా? నేనూ వస్తా, పదండి. తోటకు రేపు వెళతాను" అంది ఆమె ఆదుర్దా కనపరుస్తూ. తోట సాకుతో వచ్చినా నిజాని కామె ఒక్కసారి వాణీప్రసాద్ దర్శనం చేసుకోవాలన్న ఊహతోటే వచ్చింది. అతడి దర్శనం నది గట్టునే అయిపోయింది. కాని, భాగీరథిని చూడాలనిపించింది.

తడిపంచ భుజాన వేసుకుని బయలుదేరాడు వాణీ ప్రసాద్.

చైతన్యరహితంగా పడుకుని ఉంది భాగీరథి.

"అమ్మా!" కరుణ ప్రేమలు చిందిస్తూ పిలిచింది విమల.

అతి ప్రయత్నంతో కనురెప్పలు విప్పింది భాగీరథి. పక్కగా మంచంమీద కూర్చోమని చేసైగ చేసింది.

విమల కూర్చుంది. "ఎలా ఉందమ్మా?" ఆమె జీర్ణహస్తాన్ని తన చేతిలోకి తీసుకొని మృదువుగా నొక్కుతూ అడిగింది.

"దగ్గిరికి వచ్చింది." నీరసంగా మూలిగింది.

ముందుగా జావ కాచి తెచ్చాడు వాణీ ప్రసాద్. విమల సాయం పట్టగా లేచి కూర్చుంది భాగీరథి. జావ గ్లాసు అందుకొంటూ అతడి చెయ్యి చూచి అదిరిపోయిందామె. "వాణీ, ఏమిటది? కాల్చుకొన్నావా, నాయనా?"

"జావ ఒలికిందమ్మా."

"నేను పోయాక నీకు ప్రాప్తించబోయే అవస్థ నేను బతికి ఉండగానే చూడవలసి వచ్చిందా, నాకు!"


# వుడ్‌వార్డ్స్‌తో

## మీ శిశువును ఆరోగ్యంగాను, ఆనందంగాను వుంచండి

వుడ్‌వార్డ్స్. కుట్టునొప్పి, పుల్లదనం, కడుపు ఉబ్బరం, పళ్లు చేయునవుడు కలిగే జబ్బులకు తక్షణ నివారణ కలిగించును. వుడ్‌వార్డ్స్ గ్రైప్ వాటర్‌ను సర్వదా సిద్ధంగా వుంచుకోండి!




తెలివైన తల్లులు 100 ఏళ్లకు పైగా వాడుతున్నారు.

LPE Aiyars. F. 10 TL

భాగీరథి కంఠం వణికింది. శుష్క నయనాలలో కన్నీరు నిండుకొంది. "కోడల్ని తెచ్చుకోవాలని ఎన్నోసార్లు అనుకొన్నాను. కాని, ఆమెకు ఇవ్వడానికి నా దగ్గిర ఏమున్నది? నా శోక సంతాపాలలో సగం పంచి ఇవ్వడం తప్పితే మరో సుఖ మేదీ లేదు. పరాయి పిల్లను తెచ్చి దుఃఖమయ జీవితం ప్రాప్తింపజెయ్యడానికి నాకేమి హక్కున్నది ?"

కాళీ గ్లాస్ అందుకొని లోనికి వెళ్ళిపోయాడు వాణీ ప్రసాద్.

"పాపం!వంట అలవాటు లేనట్లుంది, డాక్టరుకు!"

"లేదుగాని, ఇక జీవితం అంతా చెయ్యి కాల్చుకోక తప్పదుకదా, నా తండ్రికి? వాడికి ఉండే ఆవేదన ఉండగా తోడుగా ఇంటి కాపరం ఒకటి నెత్తిన వేసి పోతున్నాను." కాస్సేపుఉండి అన్నది: "కాస్త వంటింట్లోకి వెళ్ళమ్మా. అన్నం కాస్త దించిపెట్టు. మామిడి ఆవా, మజ్జిగ చుక్కా వేసుకొని భోజనమైందనిపిస్తాడు, ఈ పూటకు."

'ఈమెకు మతి చెదరలేదుకదా?'

విమల సందేహాశ్చర్యాల నుండి తేరుకోకముందే, తిరిగి అన్నది భాగీరథి: "పొద్దస్తమానం మడిదడితో, అంతులేని ఆచారంతో ఉండే బాపనమ్మ కాపు పిల్లను వంటచేసి పెట్టమంటున్న దేమని ఆశ్చర్యపోకు. మనస్సు మంచిదైతే కులమేమిటి? మతమేమిటి?"

విమల లేచి వెళ్ళింది.

"అరెరే! లోనికి వచ్చివేస్తున్నారే? అమ్మ చూస్తే ఇక ఏమైనా ఉందీ?" కంగారుపడిపోయాడు వాణీ ప్రసాద్.

"అమ్మ ఆజ్ఞతోటే వచ్చాను." జంకులేకుండా కుంపటి దగ్గిరికి వెళ్ళింది విమల. దేవేంద్ర పదవి ఏదో ప్రాప్తించినట్లుగా వెలిగిపోతూందామె ముఖం.

"మిమ్మల్ని వంట గదిలోకి పొమ్మందా?" నమ్మలేక గబగబా వెళ్ళి, అమ్మ మాట నిజమేనని తెలుసుకొని, అవ్యక్తమైన హాయి ఏదో కలగగా తిరిగి వచ్చాడు. "నడుముకు కొంగు బిగిస్తున్నారుగాని, మీకు వంటవచ్చా?" పరిహాసంలోనూ ఆశ్చర్యం మేళవించాడు.

నవ్వి, అన్నది విమల: "నదిలోదిగాక, 'నీకు ఈదడం వచ్చా?' అన్నట్లున్నది మీ మాట. ఎంత రాకపోయినా నాది ఆడపుట్టుక. కొద్ది ప్రయత్నంతో చెయ్యలేనా?"

బియ్యం కడిగి పొయ్యి మీద పెట్టింది విమల.

• • •

వాణీప్రసాద్ భోజనం ముగించి వెళ్ళిపోయాడు విమల ఆకు తీసేసి ఒద్దికపెట్టి ఇవతలికి వచ్చింది. వాణీ ప్రసాద్ ఇచ్చిన మందు వమనం చేసుకొని ఆయాసపడిపోతున్నది భాగీరథి. కాస్సేపటికి తేరుకొని నిశ్శబ్దంగా పడుకొంది. తల్లి పక్కనే ముఖం దిగులుగా కూర్చొన్నాడు వాణీప్రసాద్.

"ఇక్కడ ఇలా ఉంచుకొంటే ఏం లాభం, డాక్టర్? చూస్తూ మనిషిని చంపుకొంటారా? హైదరాబాదు తీసుకువెళ్ళండి. ఒక డాక్టరు కాకపోతే మరో డాక్టరుకు చూపవచ్చు. డబ్బు విషయంలో మరేమీ బెంగపెట్టుకోవద్దు. మీకు కావలసిన డబ్బు అమ్మతో చెప్పి నేను ఇప్పిస్తాను" అన్నది విమల.

"వింటున్నావా, అమ్మా? వెళ్ళదామా, చెప్పు!" తల్లి ముఖంమీద ముఖం ఉంచి జాలిగా అడిగాడు.

ఆమె తీవ్రంగా అభ్యంతర పెట్టింది. "ఈ బొందిని ఎలాగూ విడిచిపెట్టిపోతూ, ముందే ఇంటిని కూడా విడిచిపెట్టి పొమ్మంటావేంరా? సుఖమో, కష్టమో అనుభవించానిక్కడ. నాకు పరిచయ మున్న గడ్డమీద, నేను తిరిగిన గడ్డమీద చిటికెడు బూడిద అయ్యే అదృష్టం కూడా నాకు లేకుండా చేస్తావా? ఎక్కడో దిక్కులేని చావు చావనా?"

"కాదమ్మా! అక్కడ నీకు తప్పకుండా నయమై తిరిగి వస్తావమ్మా." పొంగి వస్తూన్న దుఃఖాన్ని అణుచుకొంటూ అన్నాడు.

"ఆయుష్షు ఉంటే ఇక్కడ బతకనా, బాబూ?"

వాణీప్రసాద్ లేచివెళ్ళి, పెరటిలో పారిజాత వృక్షం కింద కూర్చున్నాడు. కొన్ని గంటలలో సంభవించబోయే మాతృ వియోగాన్ని తలుచుకొని వెక్కివెక్కి ఏడవ సాగాడు.

అతణ్ణి మెల్లిగా సమీపించింది విమల. అతడి శోకం చూసి హృదయం తరుక్కుపోయింది. "వియోగ సంయోగాలు ఒకరి అధీనాలా, డాక్టర్? అన్నీ తెలిసి అర్భకుడిలా ఏడుస్తారా? గుండె దిటవు చేసుకోవాలి" అన్నది సామనయంగా.

అప్పటికే రాత్రి ఏడు అయింది. ఆ ఆపద సమయంలో తల్లీ కొడుకుల నిద్దరినీ వదిలివేసి వెళ్ళిపోవడానికి మనస్కరించలేదు విమలకు. అసలు, వెళదామన్నా, దోనెవేసే రాముడు ఇంటికి వెళ్ళిపోయి ఉంటాడు.

"ఇంటికి వెళ్ళలేదేదమ్మా? అమ్మ నీకోసం ఎదురు చూస్తుందేమో?" అన్నది భాగీరథి.

"ఎదురుచూసినా నే నిక్కడ ఉంటానని తెలుసు, అమ్మకు. ఉదయం వెళతానమ్మా."

"వాణీ, ఆవు ముందరగడ్డి వేశావా, నాయనా?" కళ్ళుమూసుకొనే అడిగింది భాగీరథి.

"లేదమ్మా! వేస్తాను." వెళ్ళబోయాడు.

"మీరు అమ్మదగ్గిరే కూర్చోండి, నేను వేసివస్తాను." విమల వెళ్ళింది.

బాగా చేరువగా జరిగి కూర్చోమని సైగ చేసింది భాగీరథి, కొడుకును. అతడలాగే చేశాడు. అతడి శిరస్సు మీద చెయ్యివేసి గుండెల మీద అదుముకొంది భాగీరథి. "ఒకపూట నువ్వు ఎంత తిరిగినా, ఎన్ని సమస్యలతో సతమతమైనా ఇంటికి వస్తే చిరునవ్వుతో నీ హృదయంలో పువ్వులు నింపే చిన్నదాన్ని తీసుకురాలేకపోయాను. తోడు కూర్చకుండా ఒంటరివాణ్ణి చేసి పోతున్నాను. ఎలా భరిస్తావో, నాన్నా, ఈ కఠోరశోక జీవితాన్ని?" ఆగి అంది: "ఇల్లాలు లేనిది ఇంటికి అందం లేదు. స్త్రీ తోడు లేనిది నీ జీవితానికీ అందం లేదు. నీ అన్ని అవసరాలు గుర్తించే నీ అమ్మ పోతూంది. ఒకనాడు నువ్వు ఆ అవసరాన్ని గుర్తించినా అందుతుందో, లేదో?" బరువుగా నిట్టూర్చి, తిరిగి అన్నది: "ఒక్క మాట ఇస్తావా, తండ్రీ?"

"చెప్పమ్మా!" రుద్ధకంఠంతో అన్నాడు.

"నిన్ను ప్రేమించిన నీ తల్లిని సుఖపెట్టడానికి ఒక్కసారి కూడా నువ్వు ప్రయత్నించలేదు. క్షమించే హృదయం ఆమెది. విచారం లేదు. కాని, మరొకసారి నీ జీవితంలో నిన్ను ప్రేమించే స్త్రీని నొప్పించనని మాట ఇయ్యి. ఆడదాని ఉసురు తగిలితే నీ జీవితానికి శ్రేయస్సు కాదు."

"అలాగే, అమ్మా!" తల్లి రొమ్ములో తల దూర్చి పసివాడిలా రోదించసాగాడు.

శుద్ధ పంచమి చంద్రవంక లేవెన్నెలలు కురిపిస్తున్నది. ఇంటిముందు గుంజకు కట్టివేసి ఉన్న గోమాత మోరం ఎత్తుకొని గుమ్మంకేసే చూస్తున్నది, తన సేవిక ఇంకా మేత తీసుకురావడం లేదేమా? అని.

గడ్డితెచ్చివేసి, మేను నిమరసాగింది విమల. 'నీ సేవ శాశ్వతంగా ప్రసాదించు, గోమాతా!' మనసులో ప్రార్థిస్తూ అవ్యక్తమైన హాయి ఏదో పొందుతున్న విమల, "విమలా" అన్న పిలుపు విని కలవరపాటుతో తలెత్తి చూచింది.

నీళ్ళు ఓడుతూన్న బట్టలతో నిల్చున్నాడు కృష్ణ.

"ఏమిటి, మామయ్యా? ఏటిలో ఈత కొట్టి వచ్చావా?"

"ఏమిటీ తిరుగుళ్ళు, విమలా?" కృష్ణ కంఠం గంభీరంగా ధ్వనించింది.

విమల ముఖం తిప్పుకుంది.

# వేమన పద్యాలు

## పూఘా

**పరమతమ్ము** నమ్మ పరదేశ
భక్తుండొ వర్షమచట పడిన వార్త చూచి
గొడుగు విప్పె నావ పడునంచు తనమీద!
విశ్వదాభిరామ వినుర వేమ !

పదవి దొరకునంచు,పార్టీలు మార్చుచు
పదవిలేక భంగపడె నొకండు
ఫలము దక్కలేదు, వ్రతము వీడినవేని!
విశ్వదాభిరామ వినుర వేమ !

బలము గౌరవంబు పదవియు పూజ్యత
ధనమువలన కలుగు ధరణిలోన
ధనములేనివాడు ధరలోన మృతుడయా!
విశ్వదాభిరామ వినుర వేమ !

రాజుగారి పెద్దరాణి పతివ్రత
అనిన విబుధవరులు ఆగినారు
చిన్నరాణిమాట చెప్పేరు కారయా!
విశ్వదాభిరామ వినుర వేమ !

పెద్దబాలశిక్ష విద్యకు కొలయైన
సమితి సభ్యుడొకడు సభకు వెళ్లి
అన్ని విషయములకు 'ఐకంకర'యనియె:
విశ్వదాభిరామ వినుర వేమ ! *

"పద."

"వద్దు? నువ్వయితే ఈతకొట్టగలవుగాని, నావల్ల కాదు, బాబూ! అయినా ఈ రాత్రి కొంప మునిగినది ఏమున్నది, నే రాకపోతే? డాక్టరు తల్లికి చాలా ప్రమాదంగా ఉంది. వారిని అలా విడిచి రాలేను."

అంతలో మల్లిగాడు రాముణ్ణి తీసుకొని వచ్చాడు. మల్లిగాడి గుడ్డలు కూడా తడిసి ఉన్నాయి.

"విమలా!" ఈ సారి ఇంకా గంభీరంగా ధ్వనించింది అతడి కంఠం. "ఎంత చదువుకొన్నా, ఎంత విదేశాలు తిరిగి వచ్చినా నా పురుష తత్త్వంలో మార్పు రాలేదు. నా సొత్తు నే నేవిధంగా కాపాడుకోవాలో నాకు తెలుసు. దానిపై మరొకరి చూపు పడడం నేను సహించలేను."

"అయితే?"

"తర్కం వద్దు, ఆ విషయమై. కాని, నా కిది చెప్పు. వారికీ, నీకూ సంబంధమేమిటని, రాత్రిపూట ఇక్కడే నిలిచిపోయి సేవలు చెయ్యడం, వారికి?"

కొంచెంసేపు మౌనంగా ఉండి, కదులుతూ, "సంబంధమేమిటో ఇంటికి వెళ్లాక చెబుతా, పద. ఇక్కడ అల్లరి చెయ్యకు. వారికి ఉండే శోకం ఉండగా ఇదొక బాధ ఎక్కడ ఓడించను?" అంది.

"మామయ్య వచ్చాడు, తీసుకువెళ్లడానికి. నేను వెళ్లివస్తానమ్మా."

"అయ్యో! ఈ రాత్రి ఎలా వెళ్లగలవమ్మా?"

"రాముణ్ణి తీసుకొనే వచ్చాడు మామయ్య. పోవడమేమీ కష్టం కాదు."

"వెళ్లిరా, తల్లీ."

తల్లి వక్షంపై ముఖం ఉంచి పడుకొన్న డాక్టరు వంక ఒక్క క్షణం చూచి కదిలింది.

• • •

విమలకంటే ముందే ఇల్లుచేరిన కృష్ణవల్ల సమాచారం అందిన సుమతి, కూతురు ఇంట్లో అడుగు పెట్టీ, పెట్టకముందే తిట్లపూజ ప్రారంభించింది· "నీకేమైనా బుద్ధి ఉన్నదా, లేదా? ఈడువచ్చిన పిల్లవు! పరాయి ఇంట్లో రాత్రివేళ గడుపుతావా? ఆ బాపనవాళ్లతో నీ కేమిటి స్నేహ సంబంధాలు? తోటకని చెప్పి అక్కడికా నువ్వు వెళ్లడం?"

"ఆ సంబంధమేమిటో ఇంటికి వచ్చాక చెబుతానంది. ఏమిటో అడుగు, అక్కా!" ముఖం ఎర్రజేసుకొని అన్నాడు కృష్ణ.

"భాగీరధి కొడుకును నేను ప్రేమిస్తున్నాను. అదే సంబంధం. అదే శాశ్వతమైన బంధంగా కూడా మార్చుకోవాలని అనుకొంటున్నాను." నదురు బెదురు లేకుండా చెప్పింది.

"ఏమిటీ? ప్రేమా!" ముక్కుమీద వేలు వేసుకుంది సుమతి.

కృష్ణ ముఖంలో నెత్తురు చుక్క లేదు. "ఇప్పుడు నన్ను కాదని అతడినెలా ప్రేమిస్తున్నావు? ఎలా పెళ్లి చేసుకొంటానంటున్నావు?"

"ఒకప్పుడు నిన్ను చేసుకుంటానన్నానా, ఇప్పుడు కాదన్నానని నేరం మోపడానికి?"

"మరి?" తెల్లబోయాడు. "మన పెళ్ళికి ఎలా అంగీకరించావు?"

"ప్రత్యేకంగా నన్ను అడిగిన దెవడు? చిన్నప్పటి

# సమర్పణ

నుండీ పేరు పెట్టినారట, పెళ్ళిచేస్తారట! అన్ని వారి ఆలోచనలేగాని నేనొక మనిషినని, నాకూ కొన్ని అభిప్రాయాలుఉంటాయని, నన్ను అడిగిన దెవరు, నీ మీద నా మనస్సు ఉందో, లేదో?"

"ఇప్పుడడుగుతున్నాను, చెప్పు!" వస్తూన్న ఆగ్రహాన్ని అణుచుకొంటూ అన్నాడు.

"చిన్నప్పటినుండి తాతయ్య సంతానంతో కలిసి పెరిగానంటే, అన్నదమ్ముల మధ్య, అక్కచెల్లెళ్ల మధ్య పెరిగినట్లే ఉందికాని, నీ మీద ప్రత్యేకమైన అభిప్రాయం లేదు. నీలోని పురుషత్వాన్ని ప్రేమించే అవకాశం నాకు కలగలేదు."

"ఛీ! సిగ్గువిడిచినదానా! ఆడదానివై పుట్టావెందుకూ, లజ్జా సంకోచాలు లేక మాట్లాడటానికి! వీడిలో లేని పురుషత్వం ఆ బాపనవాడిలో కనిపించిందా, నీకు? నీకిదేం విపరీతమైన బుద్ధి పుట్టిందే? ఆ అష్ట దరిద్రుణ్ణి పెళ్లిచేసుకుంటావా? గవ్వ సంపాదన లేని చవట!"

"అష్టదరిద్రు డెందుకౌతాడు, ఒక శ్రీమంతురాలికి కాబోయే అల్లుడు?" సుమతికి చురుకు తగిలేలా నవ్వింది. "సంపాదన లేనంత మాత్రాన పురుషుడు అసమర్థుడు కాడు. అతడు యోగ్యుడుగా, గొప్పగా భావించడానికి అతడిలో మహోన్నతమైన గుణా లెన్నో ఉన్నాయి."

"కృష్ణలో లేవా? వాడేమీ దుర్మార్గుడు కాడే!"

"అతడిలోని గుణాలు మరో స్త్రీకి నచ్చవచ్చు!"

"శ్రీమంతురాలి కూతురువనీ, సిరి తెచ్చేదానివనీ ఆ భాగీరథి నిన్ను కోడలుగా అంగీకరించి కులం చెడుతుందేమో గాని, నేనుమాత్రం నిన్ను వాడికిచ్చి చెయ్యను. ఆఁ!"

"నువ్వు చెయ్యడమేమిటి? ఆ చేసుకొనేదేమిటో నేనే చేసుకొంటాను." పెంకెగా సమాధానమిచ్చి తన గదిలోకి వెళ్లిపోయింది విమల.

ఖిన్న వదనంతో కిటికీ దగ్గిర నిల్చున్న తమ్ముణ్ణి సమీపించి, అంది సుమతి: "పసితనం. దూరం ఆలోచించడం లేదు. గోతిలో పడబోతుంటే చూస్తూ ఉండగలమా, కృష్ణా? కులం కానివాణ్ణి కట్టుకుంటే ఎన్ని చిక్కులు? అందరినీ కాదని జీవించడానికి ఆర్థిక స్తోమతైనా ఏమైనా ఉందంటే, అదీలేదు. అతణ్ణి పెళ్లిచేసుకుంటే సుఖం నాస్తి. అన్నీ అనర్థాలే."

"ఆమె అంత గట్టిగా అంటున్నప్పుడు మనం కాదని లాభమేమిటి? బాపనవాణ్ణి కాకపోతే ఎవణ్ణైనా కట్టుకోనీ!" ఉదాసీనంగా అన్నాడు కృష్ణ.

"క్షణిక భ్రాంతికిలోనయింది విమల. దాని చేష్ట అలాగే సాగనిస్తే తరవాత అదీ, మనం పశ్చాత్తాప పడవలసి వస్తుంది. ఎంతయినా నా కడుపున పుట్టిన బిడ్డ. అది లేనిపోని చిక్కుల్లో చిక్కుకుంటే భరించగలనా?" ఆమె బిడ్డ శ్రేయస్సు ఒక్కటేకాదు, కోరేది; ఫారిన్ రిటర్న్‌డ్, అందగాడు, దగ్గిరవాడు అయిన అల్లుణ్ణి చూస్తూ ఎలా వదులుకోగలదు?

"ఈ తీరుగా మిడిసిపడేవాళ్లకి అటువంటి శాస్తి జరగాల్సిందే!"

"కాదు, కృష్ణా! దానికేమీ తెలియదు. పిల్లతనంగా ప్రవర్తిస్తూంది. నిప్పుముట్టుకోబోతూంటే వారించడం మన ధర్మం."

"అయితే, చెయ్యగలిగిం దేమిటి?"

"త్వరలో ముహూర్తం పెట్టిస్తాను. పెళ్లి చేసుకొని నీతో తీసుకుపో. నాలుగు రోజులైతే అదే కలిసిపోతుంది."

"అదెలా సాధ్యం, అక్కా? తను అంత ఖచ్చితంగా నామీద మనస్సు లేదని చెబుతూంటే?"

"ఇన్నాళ్లూ నిన్ను ప్రేమించే అవకాశం కలగలే దంటూందిగా? పెళ్లే ఆ అవకాశం కల్పిస్తుంది."

కాస్సేపు మౌనం వహించాడు కృష్ణ. విమల ప్రవర్తన పిల్లచేష్టగా తీసివేస్తేనేగాని అతడి హృదయానికి ఊరట లేదు. కారణం—అతడు విమలను గాఢంగా ప్రేమిస్తున్నాడు. 'ఆమెకు నామీద ప్రేమ లేకపోతే, పోనీ. అసహ్యమైతే లేదుకదా! ఆ ప్రేమ కలిగించడానికి నా దగ్గిర అర్హతలేం తక్కువ? విద్య, సౌందర్యం, ఐశ్వర్యం, అన్నీ ఉన్నాయి' అనుకొన్నాడేగాని, అతణ్ణి సంకోచం వదలలేదు. 'ఇంత ఖచ్చితంగా నన్ను కాదంటున్న మనిషి, నా చేతికెలా వస్తుంది?' మళ్ళీ మథనపడ్డాడు.

"ఏమో! మనస్సు మారుతుందో, లేదో ఎవరు చెప్పగలరు? చూస్తూ నన్ను గోతిలోకి దింపబోకు."

"నీకు తెలియదు, కృష్ణా! తప్పకుండా దారిలోకి వస్తుంది."

"నీకా నమ్మకం ఉంటే అలాగే కానీ!"

• • •

మిట్టమధ్యాహ్నం వేళ ఇల్లుచేరిన వాణీప్రసాద్ మందుల సంచీ బల్లమీద వేసి, కాలుతున్న కడుపుతో మంచంమీద వాలిపోయాడు. లేచి వంటచేసుకొనే ఓపిక లేదు. కాని, కడుపులో మంట పడుకోనిచ్చేట్లు లేదు. తనకు వివాహం చెయ్యకుండానే పోతున్నందుకు అమ్మ ఎందు కంతగా బాధపడిందో ఇప్పుడు అర్థమౌతూంది. 'ఏ దేవతయినా ఆహారం పళ్లెం పట్టుకొని నా ముందు నిలిస్తే?' అదీ ఆ క్షణంలో అతడి సుందర స్వప్నం! తీరని కోరికకూడా! అమ్మ మరునాడు చనిపోతుందనగా విమల తనకు వండిపెట్టిన సంఘటన గుర్తువచ్చింది. అదొక మధురమైన అనుభవంగా అనిపించింది వాణీప్రసాద్‌కు. 'అమ్మ చర్యలో అంతరార్థ మేమిటి? ఆ ఒక్కరోజు వంటకోసం

**గతంలో అనుభవించి గుర్తు ఉంచుకొన్న దుఃఖాలు వర్తమానంలో అనుభవించే సుఖాలను అమృత తుల్యం చేస్తాయి.**

—శౌలాక్

అమ్మ ఆచార భంగానికి ఎందుకు ఒప్పుకొంది? సదా ఆమె సేవ లందుకొనే అవకాశం లేదు కదా!''

లేని ఓపిక తెచ్చుకొని లేచాడు వాణీప్రసాద్. చన్నీళ్ళే నాలుగు చెంబులు మీద గుమ్మరించుకొని వంట ప్రారంభించాడు.

గంజిగంజిగా ఉడికీ ఉడకని అన్నం ఆకులో వడ్డించుకొని, అనుపానమేదీ లేక పెరుగుతో భోజనం కానిస్తూ అనుకొన్నాడు. 'ఈ అన్నం తింటే నెల తిరగకుండానే అమ్మ దగ్గిరికి వెళ్లిపోవచ్చు!'

సాయంకాలం నది గట్టుకు వెళ్లాడు. దోనె అపుకొని రాముడు ఉన్నాడు. "విమల ఈమధ్య తోటకు వెళ్లడం లేదా, రాముడూ?''

"లేదు, బాబూ! ఆ యమ్మ పెళ్లికదా? పందిరేశారివాళ. రేపు పొద్దున ఎనిమిది గంటలకు లగ్నం!''

ఏదో ప్రియమైన వస్తువు శాశ్వతంగా దూరమైపోతున్నట్లు వ్యథ చెందాడు వాణీ ప్రసాద్. 'విమల ఎవరు? కొన్నాళ్ళక్రితం ఆమె నాకేమీ కాదు. ఇప్పుడామె వివాహిత కాబోతూంటే నేనెందుకు బాధపడుతున్నాను? ఏమిటీ అనుబంధం?'

యువకులయిన స్త్రీ పురుషుల మధ్య ప్రేమానుబంధం ఏవిధంగా ఏర్పడేది తెలియదు. తెలిసినా నివారించబడని ప్రవాహమది. ఇంకింపజేయడం అసలే అసాధ్యం.

సంజ చీకటు లలుముకొంటుండగా బరువెక్కిన మనస్సుతో ఇల్లు చేరాడు వాణీప్రసాద్. అమ్మలేని ఇంట్లో దేవుడులేని కోవెలలో అడుగు పెట్టినట్లుగా ఉంది. మూలమూలలా, అడుగడుగునా అమ్మను వెదుకు కొన్నట్లు ఉంటుంది. సంధ్యవేళ దీపారాధన చేసి, కాళ్లు చేతులు కడుక్కొని, పెరుమాళ్ళ దీపారాధన కూడా చేసి, ఇంటిముందు కట్టివేసిఉన్న ఆవుకు మేత తెచ్చివేసి ఒళ్లు నిమిరాడు. ఇవన్నీ తల్లిచేసే పనులు. ఏ పని చెయ్యబోయినా అమ్మ తలపుకి వస్తూంటుంది అతడికి. బాధ పడుతూంటాడు. మరొక స్త్రీ ఆ స్థానంలోకి వస్తేనే గాని తనకు ఆ బాధనుండి విముక్తి లేదు. కాని తనకా అదృష్టం లేదు!

• • •

సరస విలాసాలతో, కింకిల నవ్వులతో ఆనందోత్సాహం నిండిన ఆ పెళ్లి ఇంటిలో దుఃఖం అంతా, ఒకే వైపు తరిమినట్లుగా—మేడమీద గదిలో కన్నీళ్ళు కాల్వలు కట్టిన కళ్ళతో కిటికీ దగ్గిర నిల్చుని బయటి చీకటి ప్రకృతిలోకి చూస్తూన్న విమలను ఆశ్రయించింది. దూరాన పిల్లనగ్రోవి పాట గాలిలో తేలివస్తున్నది. పల్లీయులు పాడే పిల్లనగ్రోవి పాటలో ఒక విచిత్ర మున్నది. సంతోషం నిండిన హృదయాలకు ఆనంద గీతికలా, దుఃఖజీవులకు విషాద రాగంలా వినవస్తుందది. విమలకు ఎన్నోసార్లు తన్మయత్వం కలిగించిన ఆ పిల్లనగ్రోవి పాట ఇప్పుడు విషాద భావాలు రేకెత్తిస్తున్నది.

తెల్లవారితే ముహూర్తం. అంత పాపిష్ఠి దినం తన జీవితంలో రాదనుకొంది విమల. ముహూర్తం ఏర్పాటయిన నాటినుండి ఆమె ఆ ఇంటిలో బందీ. ఎన్నిసార్లు ప్రయత్నించినా పారిపోవడానికి వీలు కలిగింది కాదు. అమ్మ వెయ్యి కళ్లతో కనిపెట్టే ఉంటుంది. తన కన్నీళ్లకు కూడా కరగని కఠినచిత్తురాలయిందామె.

కృష్ణను అడిగింది ఒకసారి, ఏడుస్తూ, "ఈ బలవంతపు పెళ్లివల్ల నువ్వేం సుఖపడగల వనుకొంటున్నావు, మామయ్యా?'' అని.

తన పరిస్థితి చూచి ఆ క్షణంలో కొంచెం కదిలినట్లు కనిపించినా, ఏదో ఆశాజ్యోతి కళ్లలో వెంగగా అప్పటికి నిబ్బరం తెచ్చుకొని మౌనంగా వెళ్లిపోయాడు కృష్ణ.

'పారిపోవాలి. ఎలా?' ముహూర్తం ఏర్పాటయిన క్షణంనుండి తను ఆలోచిస్తూనే ఉంది, ఈ క్షణం వరకూ. 'ఆ మూడు ముళ్లు పడ్డాయంటే చచ్చిన పాములా పడిఉండడం తప్పితే తను చెయ్యగలిగింది లేదు!'


తెల్లవారుజామున నాలుగు గంటలవుతూంటే పెళ్లి ఇంట్లో ఒక్కొక్కరే మేలుకొంటున్నారు. సుమతి అప్పుడే మేల్కొని ఎవరికో ఏవో పనులు పురమాయిస్తూండడంతో మునిగింది.

మెల్లిగా మెట్లు దిగి పెరటిలోకి వచ్చింది విమల. అక్కడ ఎవరూ లేరు. చప్పుడు కాకుండా పెరటి తలుపు తీసుకొని బయటపడి ఒక్క పరుగున నది గట్టుకు వచ్చి చేరింది. 'తను పారిపోవడం క్షణంలో తెలిసిపోతుంది ఇంట్లో. వెతుక్కుంటూ వాగలరు. ఎవరికీ కనిపించకుండా దాగిపోవాలి.' అటు ఇటు తిరిగి రెండు రాళ్ల నడుమ నక్కి కూర్చుంది. అప్పటికింకా చీకటిగానే ఉంది.

పది, పదిహేను నిమిషాల్లో పెట్రొమాక్సులైట్లూ, టార్చిలైట్లూ పట్టుకొని పరుగు పరుగున రానేవచ్చారు కొందరు. అందులో కృష్ణకూడా ఉన్నాడు. విమల దాక్కొన్న రాళ్ల పక్కనుండే నడుస్తున్నారు.

"మీ చాదస్తం కాకపోతే, ఏటి దగ్గిరి కెందుకు వస్తుంది ఆ పిల్ల? ఇక్కడేముందని?''

"బహుశః ఇది బలవంతపు పెళ్లేమో! అందుకే పారిపోయింది. వచ్చినా ఎందుకుంటుందిక్కడ? అప్పుడే గంగమ్మ కడుపులో దాగిపోయి ఉంటుంది.''



సాగర ప్రతిబింబాలు

ఫోటో— [illegible]










# సమర్పణ

వెంట వచ్చిన బంధువుల రకరకాల అభిప్రాయాలకు బాధపడుతున్నట్లు ధ్వనించింది కృష్ణ కంఠం. "విమల అలా చెయ్యదు. ఆత్మహత్య చేసుకొనే పిరికి పిల్ల కాదది."

"మరి ఏమైందంటారు?"

ఆ కంఠాలూ, అడుగుల చప్పుళ్లూ క్రమంగా దూరమైపోయాయి.

తూర్పున అరుణరేఖలు విచ్చుకొంటున్నాయి. ప్రకృతి క్రమంగా చైతన్యం పొందుతున్నది. రాయి చాటునుండి లేచి చుట్టూ కలయజూచింది విమల. అందరూ వెళ్లిపోయారు. అవతలిగట్టున దోనె వేసే రాముడు వచ్చి ఉన్నాడు. చెయ్యి ఊపుతూ ఎలుగెత్తి పిలిచింది. దోనె నడుపుతూ తీసుకువచ్చాడు వాడు.

"మీరా, విమలమ్మగారూ!" రాముడి ఆశ్చర్యానికి అంతం లేదు.

విమల క్షణం ఆలస్యం చెయ్యకుండా దోనెలోకి దూకి, "తెడ్డు వెయ్యి, మొదట! తరవాత చెబుతా" అంది తొందరచేస్తూ.

దోనె అవతలిగట్టున ఆగగానే, అన్నాడు రాముడు: "ఇక చెప్పండమ్మాయిగారూ, ఏంటో?"

వేలిని ఉన్న ఉంగరం తీసి వాడి చేతిలో వేసి, "నేను చెప్పిన పని చెయ్యాలి, నువ్వు. మా ఇంటికి పరిగెత్తుకు వెళ్లి 'విమలమ్మ ఏటిలో పడి కొట్టుకుపోతూంటే చూశా'నని చెప్పు" అని చెప్పింది ఆత్రంగా.

"ఏంటీ కథ, అమ్మాయిగారూ?" అయోమయంగా అన్నాడు రాముడు.

"నేను చెప్పిన పని చెయ్యరా, మొదట. చెప్పి, నువ్వు ఎక్కడికైనా వెళ్లిపో, దోనె దగ్గిర ఉండకుండా. ఈ వేళంతా ఎవరినీ ఏరు దాటించకూడదు." కదలబోతున్న రాముడితో, "నమ్మకంగా చెప్పాలి చూడు" అని హెచ్చరించి బయలుదేరింది.

ఏటిలో ఈత కొడుతూ ఆమె వెనకే అనుసరించి వస్తూన్న కృష్ణను ఆమె గుర్తించనే లేదు.

వాణీప్రసాద్ ఇల్లు చేరింది విమల. అతడు ఇల్లు చిమ్ముతున్నాడు ఆ సమయంలో. పెళ్లికూతురు అలంకారాలతో ఇంట్లో సాక్షాత్కరించిన విమలను చూచి నివ్వెరపోయాడు కొన్ని క్షణాలు అలాగే.

విమల మొదట చేసిన పని, అతడి చేతిలో చీపురు లాగి, దూరంగా విసరివెయ్యడం. "పదండి, వాణీ బాబూ! ఎక్కడికైనా పారిపోయి పెళ్లిచేసుకొందాం. ఏమాత్రం ఆలస్యం చేసినా పట్టుబడిపోతాను. బలవంతపు పెళ్లికి బలిపెడతారు, నన్ను. ఊఁ కదలండి!"

అంతవరకు నిర్జీవ ప్రతిమలా నిల్చుండి పోయిన వాణీప్రసాద్, మెల్లిగా చైతన్యం పొంది, "ఏమిటి, విమలా, ఇది?" అన్నాడు.

"ఏమిటని అడగడంలోనే ఉన్నారా, ఇంకా?" అతడి నిదానానికి నుదురు కొట్టుకుంది.

"ఎక్కడికి పోదామంటావు, చెప్పు!"

"ఎక్కడికైనా సరే! మీరు డాక్టర్లు. నేను గ్రాడ్యు

యేటును. నా నగలన్నీ అమ్మివేసి చక్కగా ప్రాక్టీస్ పెట్టండి. నేను ఉద్యోగం చేస్తాను. దర్జాగా, చల్లగా వెళ్లిపోతాయి రోజులు.''

అతడి ముఖంలో విస్మయం, కలవరపాటు తొలగి పోయి స్థిరగాంభీర్యం నిండుకొంది. మెల్లని స్వరాన అన్నాడు: ''వాణీప్రసాద్‌పై నీ కెటువంటి అభిప్రాయం ఉంది?''

''...'' ఊహించని ప్రశ్న విని అయోమయంలో పడిపోయింది.

''కలలో కూడా ఒకరి సొత్తు అపహరించే దొంగ కాదతడు. అతడి ముందు నిల్చున్నది కృష్ణ వధువు. అతడికి ఎంత ప్రేమ ఉన్నా తన వధువుగా స్వీకరించ లేదు.''

''వాణీ బాబూ!''

''తొందరపడి వచ్చావు. ఈ పని నావల్లకాదు.'' నిర్మోహమాటంగా చెప్పాడు.

విమల కళ్లవెంబడి జలజలా అశ్రువులు కారసాగాయి. ''ఇప్పుడు నా గతేమిటి?''

వాణీప్రసాద్ మౌనం వహించాడు. ఆమెకు ఒక దారి చూపించే స్థితిలో లేడతడు. ప్రేమించిన స్త్రీ ఎదట నిలిచినా స్వీకరించలేని స్థితిలో ఉన్నవాడి ఆవేదన ఎంతటి దుర్భరం!

కొంచెంసేపు మౌనంగా నిలబడిపోయి కదులుతూ, ''సరే. మీ ఇంట స్థాన మివ్వకపోతే గంగమ్మ తన కడుపులో నా కింత చోటు ఇవ్వకపోదు. వెళ్లిపోతాను. ఏటిలో పడి చచ్చిపోతాను'' అంది దుఃఖావేగాన్ని అణుచుకొంటూ. గుమ్మంలో అడుగు పెడుతూనే కెవ్వుమంది, ''వచ్చాడు, నా పాలిటి రాక్షసుడు'' అంటూ.

కృష్ణ ఆమె భుజాలు పట్టుకొని లోనికి నడిపించుకు వచ్చాడు.

''నన్ను మీరిద్దరూ క్షమించాలి, వాణీబాబూ! మూర్ఖుణ్ణి. విజ్ఞాన సౌందర్యాలతో విమల మనసు మార్చివేయగలననుకున్నానేగాని, విశుద్ధమైన ప్రేమ ముందు ఈ సమస్త ప్రపంచం తృణప్రాయమౌతుందని గ్రహించలేకపోయాను.

''ఒకరిని ప్రేమించిన స్త్రీకి అప్రియమైన భర్త కావడం కంటే దురదృష్టం మరొకటి లేదు పురుషుడికి. సమయం మించిపోకుండానే రక్షించబడ్డాను.'' కరుణ విషాదాలు మేళవించాయి అతడి కంఠంలో. ''లోభాన్ని అణుచుకోనంతవరకే మనిషి స్వార్థ సంకుచి తత్వాలకు లోబడి పశుప్రాయంగా ప్రవర్తించేది. సమస్త దుఃఖాలకు కారణమైన ఈ ప్రలోభాన్ని జయించిననాడు ఆత్మసుఖ మేమిటో అనుభవం కౌతుంది. ఇప్పుడామెమీద నాకు కోరిక లేదు. నిష్కళంక హృదయంతో విమలను మీకు సమర్పిస్తున్నాను.''

..విషాదాంతం కాబోతున్న కథ క్షణంలో సుఖాంతంగా మార్చివేసి, విమల చెయ్యి అందుకొని కదులుతూ చిరునవ్వుతో అన్నాడు కృష్ణ: ''జోడుగా పోయి ఎక్కడో చిక్కుమాలిన పెళ్లి ఎందుకు చేసుకోవాలి? అక్కను నేను ఒప్పిస్తాను. అన్నీ యథావిధిగా జరగనీయండి. వరుడుమాత్రం కృష్ణ కాదు; విమల మానసచోరుడు వాణీప్రసాద్!'' ★


## సివిల్ ఇంజనీరింగ్ కాలేజి

### మచిలీపట్నం

రిజిస్టర్డు—స్థాపితము 1955—పోస్టుబాక్సు33

కేంద్ర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వములచే B.E., డిగ్రీకి సమానముగా రికగ్నయిజు కాబడిన A.M.I.E. పరీక్షలకు శ్రేష్ఠమైన కోర్సులు కలవు. హయ్యర్ సెకండరీ ప్యాసు అయిన వారికి, P.U.C., చదివిన వారికి B.Sc., (1st year) L.C.E., L.M.E., ప్యాసు అయిన వారికి, B.A., B.Sc., చదివిన వారికి ప్రత్యేక కోర్సులు కలవు. A.M.I.E., సంస్థలన్నింటికన్న హెచ్చు పరీక్ష ఫలితములు. ప్రాస్పెక్టసు— అప్లికేషను కొరకు ప్రిన్సిపాల్ గారికి రు. 1—50 పై.లు M.O. పంపవలయును.

పునఃప్రారంభము: 27—6—66.






గౌర్ మోహన్ దాస్ అండ్ కం,.

233, పాత చైనాబజార్ వీధి,

కలకత్తా—1

ఫోన్: 22—6580





## మీ రూపే వేరుగా వుంటుంది

మలయ్ చందన సబ్బు ఘుమఘుమ మిమ్ము మైమరిపిస్తుంది. మీ శరీర చర్మం నిగనిగ లాడుతూంటుంది. హాయినిచ్చేదాని సువాసన మరువలేరు. మంచి శరీరచ్ఛాయకు మలయ్ చందన సబ్బును రోజూ వాడండి.

మలయ్ కాగితం విప్పినాసరే చందన సబ్బు సువాసన అలాగే వుంటుంది





కలకత్తా కెమికల్ ప్రాడక్ట్

IWT CC ML 3103